**భార్య అందిస్తూన్న తాంబూలం నములుతూ, వెన్నెల్లో హాయిని అనుభవిస్తూ... 'అనగా అనగా' అని కథ మొదలుపెట్టాడు ఆ భర్త. ఏమిటా కథ? ఎవరా అమ్మాయి?**

శీతాంశుడు వేడిగా వెలుగుతూవుంటే డాబామీద, చుక్కలకింద రేణుకా, సుంద్రరావు కూర్చువ్నారు. పక్కన అయిదేళ్ళ బాబు.

రేణుక తమలపాకులకి సున్నం రాస్తూ ''ఇవాళ కబుర్లు కాదు, ఒక కథ చెప్పండి" అంది.

సుంద్రరావు ఒక్క క్షణం ఆలోచించి వెనక్కి వాలి ''అనగా అనగా ఒక రాజు...." అన్నాడు.

రేణుక ఉలిక్కిపడి "రాజుల కథలు వద్దు. సోషల్ కథ చెప్పండి" అంది.

సుంద్రరావు నవ్వి "ఇది సోషల్ కథే. ఆ అబ్బాయి పేరు రాజు" అన్నాడు.

"ఎలా వుంటాడు?"

"నాలాగే బుద్ధిమంతుడు. భయస్తుడు. ఆడపిల్లల జోలికి పోడు."

"ఆ గొప్పలెందుకు మధ్య? అతనికి పెళ్ళయిందా?"

"కాలేదు. నల్లటి నలుపు. పైగా నాలాగే అమాయకుడు."

"మీరు అమాయకులేం కాదు. మీలాగే 'అమ్మాయకుడు' అనండి" అంది రేణుక మాటకి అడ్డంవస్తూ.

"అంతటి నల్లటి అబ్బాయీ ఎదురింటి పెళ్ళి కాని రాణికి నలకూబరుడులా కనిపించాడు."

"నల్లకూబరుడు అనండి" అంది రేణుక మళ్ళీ మాటకి అడ్డంవస్తూ.

"అంతే అనుకో. నన్ను చెప్పనీ. అతన్ని చూసిన క్షణంనుంచీ ప్రేమించేసింది. ఎలాగైనా అతన్ని ముద్దు పెట్టుకోవాలని, కౌగిలిలో కట్టిపారెయ్యాలని మనసు పుట్టింది ఆ అమ్మాయికి"

"ఛీ. అవేం వూహలండీ ఆ అమ్మాయికి? హాయిగా పెళ్ళిచేసుకోవాలనిపించాలి గానీ. ఇంతకీ ఆ అమ్మాయి ఎలా ఉంటుంది?"

"తెల్లటి తెలుపు. చురుకైనది. తెలివైనది"

"అంతేనా? ఇంకా వర్ణించండి. అందం, ఆకర్షణ...."

"నేను పరస్త్రీలని వర్ణించను."

"ఓయబ్బో! అంత మడికట్టుకు కూర్చున్నారా? మీ పైపిస్టు అమ్మాయిని వర్ణించటం లేదూ?"

"....అది సర్లే. కథ విను. రాణి కౌరవ పాలు ఎక్కువున్న అమ్మాయి. రాజు తనని చూడటంలేదని గమనించి తనే రంగంలోకి దూకింది. అది మొదలు రాణి తన కోరిక తీర్చుకోవడానికి ఏదో ప్రయత్నిస్తూ ఉండటం అతను రక్షించుకోవడం నిత్యకృత్యమయిపోయింది."




"ఏం చేసిందేమిటి?"

"అన్నీ చేసింది. ఆ అమ్మాయి తమ్ముళ్ళు, వాళ్ళ స్నేహితులు అంతా కలిసి ఎనిమిది మంది చిన్న పిల్లలున్నారు చేతిలో. నమ్మిన బంటుల్లాంటివాళ్ళు. ఏం చెపితే అది చేస్తారు. పని చెబితే ఉత్సాహంగా ముందుకు దూకడంతప్ప వెనక్కి వచ్చే ప్రసక్తే లేదు. అంత వరకూ గ్యారంటీ."

"అభిమన్యుడి లాగా?"

"అంతే.అంతే. కాకపోతే చిన్నపిల్లలు కావటం మూలాన ఒక్క అడుగు వేస్తే అలసిపోయేటంత అర్భకులు. పని మొదలెట్టిన కొత్తలో మరో అడుగు వెయ్యచ్చు. అంతే. 'నిన్ను కలుసుకోవాలని వుంది' అని చీటీ రాసి ఒకడికిచ్చి ఎదురింటి అబ్బాయికి యిచ్చి రమ్మని ముందుకు నెట్టింది."

"ఆ అబ్బాయి ఏం చేశాడు?"

"ఇతనికీ తక్కువేంలేరు మనుషులు. ఒక పిల్లాడి చేతికి 'నన్ను కలుసుకోవద్దు. నీ ధాటికి నేను తట్టుకోలేను' అని చీటీ రాసి పంపించాడు. యిలా కొన్ని చీట్లు వెళ్ళాయి."

"చీటీలకి లొంగడని గ్రహించిందా?"

"ఆ! గ్రహించింది. అప్పైవ అగ్ర

హించింది. తనే వెడతాననితొందరపడింది. కాని వాళ్ళ మామయ్య హయగ్రీవమూర్తి పైముకి తగిన సలహా ఇచ్చాడు. అమ్మాయ్, ప్రేమ వ్యవహారాల్లో ఆడపిల్ల తొందరపడటం మంచిది కాదు. ముందు బంధువులం మమ్మల్ని వెళ్ళనీ. మా లెవెల్లో ప్రయత్నం జరిగాక తేలక పోతే అప్పుడు నువ్వు వెళ్ళి (పసుపు) తాడో (కప్పో) పేడో తేల్చెయ్యొచ్చు. నేనూ తుంబురుడూ వెడతాం అన్నాడు."

"తుంబురుదెవరండీ? అదేం పేరు?"

"వాడు రాణికి ఇంకో మామయ్యలే. అయినా వాళ్ళ అమ్మా, నాన్నా పెట్టిన పేరు కాదనడానికి నువ్వు ఎవర్తివి?"

"అగస్త్యుడు, మైనాకుడు, జమదగ్ని అని కూడా పెడతారా?"

"పెట్టరులే. ఆయన పేరు తుంబురుడు అయితే నేనేం చేసేది? ఇది కథ కాదు. నిజంగా జరిగిందే. తెలుసా."

"సరే చెప్పండి."

"ఆ అన్నదమ్ములున్నారు చూశావూ- వాళ్ళ బుద్ధి నడక అంతా వక్రం, ఏడంకె లాగా. వాళ్ళేం చేసేదీ, వాళ్ళ దృష్టి ఏటు ఉండేదీ అర్థం చేసుకోవడం కష్టం. బాగా తెలిసిన వాళ్ళు కూడా పొరపాటుపడుతూ ఉంటారు. ఒకే దెబ్బకి రెండు పిట్టల మీద కన్ను వేయగల సమర్థత ఉంది. ఒకటి చేస్తున్నట్టు కనబడి మరొకటి చేసేరకం. ముక్కుకి సూటిగాపోయే స్వభావం కాదు. ఇంతకీ వాళ్ళ బయలుదేరి మొత్తంమీద హంగామా చేశారు. "మా రాణిని మీ అబ్బాయికి చేసుకోవాలి" అంటూ ఇంటి దాకా వెళ్ళి ఆ అబ్బాయిని కలుసుకోనే లేదు. రాజు తరపు పిల్లలు వాళ్ళని ముందుకు రాకుండాచేసి పెద్దవాళ్ళకి కబురు పెట్టి రప్పించారు. పెద్దవాళ్ళొచ్చి "మా వాడికి చేసుకోవాలని లేకపోతే మీ జబర్దస్తీ ఏమిటి? అయినా ఆడపిల్ల తరపు వాళ్ళు ఇలాగేనా మాట్లాడేది?" అంటూ అడ్డుపడ్డారు. హయగ్రీవమూర్తికి తిక్క-

జాలిమ్ లోషన్
గజ్జి తామరకు పేటెంటు మందు
అన్ని షాపులలోను దొరకును
ORIENTAL CHEMICAL WORKS
RAO (INDORE)

లేచుకొచ్చింది. 'ఆడపిల్ల తరపు అయితే మాత్రం అణిగి మణిగి పడుండాలా? మీ అబ్బాయిని మా అమ్మాయి లేవదీసుకు పోవడం ఖాయం' అన్నాడు. మాటా మాటా పెరిగి చేతులూ చేతులూ కలిసి గలాటా అయింది. ఇద్దరు పెద్దవాళ్ళూ, ఇద్దరు పిల్లలూ హాస్పిటలు పాలు అయ్యారు."

సుందర్రావు కథ ఆపి రేణుకకేసి చూశాడు అడ్డుపడటం లేదేమిటని. రేణుక శ్రద్ధగా వింటూ ఆలోచిస్తున్నట్లు వుంది.

"ఏం? మాటకి అడ్డుపడటం లేదేం?"

"మీరు చెప్పే కథ సుఖాంతం అయేలా లేదు. ఆడపిల్ల తరపువాళ్ళే లేనిపోని కొట్లాటకి దిగుతారా ఎక్కడైనా?"

"దిగారు కాబట్టే చెప్పేది. మామూలుగా, మర్యాదగా జరిగితే కథేముంది? అయినా ఇది కథ కాదని చెప్పలేదూ?"

"అయినా అంత నల్లటి అబ్బాయికి, అంత తెల్లటి అమ్మాయికి పెళ్ళేమిటండీ?"

"ఎవరి కెవరు రాసిపెట్టి వుంటే అలా జరుగుతుంది. నువ్వు చెల్లెలి కాపురం, నాదీ ఆడజన్మే సినిమాలు చూడలేదూ?"

"సరే కానివ్వండి. సుఖాంతం చెయ్యకపోతే మాత్రం రేపు పొద్దున మీకు టిఫినూ, కాఫీ వుండవు" అంది రేణుక.

"సరే. ఒకసారి కొట్లాట అంటూ జరిగాక ఇంక పంతాలు పెరిగిపోయాయి. ఆ అబ్బాయినే చేసుకుని నల్లటి జడలో నందివర్ధనంగా వెలిగిపోతానని ఆ అమ్మాయి అంది. ఆ అమ్మాయి తెల్లగా వుంటే మాత్రం రాజహంస నేరేడు పండు తిన్నట్టు మా అబ్బాయి మీద దృష్టేమిటి? పైగా బలవంతంగా చేసుకుంటాననడ మేమిటి? మేము చచ్చినా ఒప్పుకోం— అని అతని బంధువులు అన్నారు. రాజు మనసు రాజుకుంది"

"ఎవరిమనసు వాళ్ళకుంటుంది" అంది రేణుక.

"జోకుకాదు. రాజు మనస్సు ప్రజ్వరిల్లింది అని అర్థం."

'ప్రేమాగ్నితోనా? కోపాగ్నితోనా?'

"నీ యిష్టం వచ్చినట్లు అనుకో. మొత్తానికి వీళ్ళ కొట్లాట అందరికీ ఆసక్తి కలిగించింది. వీధికిఇటువాళ్ళంతా రాణిపక్షం, అటువాళ్ళంతా రాజు పక్షం అయిపోయారు. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేటట్లు తయారయింది పరిస్థితి."

"ఇంక పెళ్ళి అయినట్టే. మీకు రేపు టిఫిను, కాఫీ యోగ్యత లేనట్టుంది. మళ్ళీ దెబ్బలాటలు జరిగాయా?"

"ఆ! రాజు తలచుకుంటే దెబ్బ (లాట)లకు కొదవా అన్నారు. దెబ్బలాటలు జరగటం హాస్పిటల్‌ని నింపటం జరుగుతోంది గాని, ఎటూ తేలటం లేదు" అన్నాడు.

"ఆ అమ్మాయి ఏం చేస్తోంది?"

"వెనకఉండి కథ నడిపిస్తోంది."

"ఈ ప్రేమ వ్యవహారాల్లో పిల్ల లెందుకండీ?"

"ఇప్పటినుంచీ ట్రెయినింగు— వాళ్ళే పెద్దయి ఆ ఏడడుగులూ నడిస్తే తనంత వాళ్ళు కాగలరని రాణికి తెలుసు. అయినా ముందు అందర్నీ పంపుతూ సమయం చూసి తను వెళ్ళాలని ప్లాను. ఒకసారి రాజు గది కిటికీ తెరిచిఉన్నట్లు గమనించి తను బయటికివచ్చి అతనికేసి సూటిగా, ప్రేమగా, మత్తుగాచూసి 'రాజా' అని పిలిచింది. అతను హడిలిపోయాడు. ఒక్క కేక వేసేసరికి అతని బంధువు వచ్చి కిటికీ దగ్గర అడ్డం నుంచుని దేగలాగా ఆమె కేసి చూడటం మొదలుపెట్టాడు. తన మీదికి వచ్చేటట్లున్నాడని భయపడి రాణి తప్పుకుంది."

"మీరు గలాటా పెళ్ళి అని కథ రాసి పంపకూడదూ, సుఖాంతం కథ చెప్పమంటే ఇదా మీరు చెప్పేది?"

"సుఖాంతం కాదని నేను అన్నానా? కొట్లాటలు జరిగినా ఎన్ని పెళ్ళిళ్ళు సవ్యంగా జరగలేదూ? మొత్తానికి అబ్బాయికి భయం పట్టుకుంది. ఎప్పుడూ ఈ అమ్మాయి నన్ను వెతుకుతూనే ఉంటుంది- అన్నాడు భయంగా తన బాబాయి లావుపాటి గజపతిరావుతో. ఆయన మొండివాడు. అందువల్ల రాజు కన్నా బలవంతుడు. 'నువ్వు ఆ మూల మంచంమీదకూర్చో. నేను ముందుకొచ్చి గుమ్మం దగర నీకు అడ్డుగా నుంచుంటాను. నిన్నేం చేయగలరో చూస్తాను. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు' అంటూ. ఇంకో బాబాయి కూడా ఉన్నాడు. ఈయన ఇంటిపేరు కూడా "లావుపాటి" వారే. ఆయనకి వరసకి తమ్ముడు. ఈయన పేరు గజాననరావు. ఈయనా అదే హామీ ఇచ్చాడు గాని, పెద్దాయనే రాజుకి దగ్గర సంబంధం. చనువెక్కువ. ఆయన చెప్పినట్టే చేశాడు" అన్నాడు సుందర్రావు.

రేణుక నవ్వింది. "ఇంక కథ చాలు లెండి" అంది.

అమ్మ ఇలా మాటమాటకీ అడ్డుపడి కథ చెప్పనివ్వక పోవడం నచ్చటంలేదు బాబుకి. పైగా కథ నిండా బోల్డు ఫైటింగులున్నాయి చక్కగా.

"అమ్మా, కథ చెప్పనివ్వు" అన్నాడు.

"నేను చెబుతాలేరా మిగతాకథ. నాక్కూడా తెలుసు" అంది.

"నాన్న బాగా చెబుతాడు" అన్నాడు బాబు.

"నువ్వు నాన్నగారిపార్టీయేలే. అమ్మని ఎప్పుడు సమర్థించావుగనక? అవునూ మీ కథలో ఇంకా కొన్ని పాత్రలున్నాయా?"

"ఉండాలేమో" అన్నాడు సుందర్రావు అనుమానంగా చూసి.

"ఉండాలనుకుంటాను."

"తర్వాత కథ నీకు తెలుసునా?" అన్నాడు.

రేణుకకి తెలిసిపోయిందేమోనని పిస్తోంది అతనికి.

"తెలుసు. ఇలాగే రాయబారాలూ, కొట్లాటలూ జరుపుతూనే రాణి అవకాశం కోసం చూస్తోంది. హాస్పిటల్లో కొత్త వాళ్ళు చేరుతూనే ఉన్నారు. అతని బంధువులని కొట్లాట మిషతో పక్కకి తప్పించి మామయ్యనో, బాబాయినో లావుపాటి పక్కింటి పిన్నిగారు గజలక్ష్మినో. ఆసరాగా పెట్టుకుని రాజు సమక్షానికివెళ్ళింది."

"తర్వాత?" అన్నాడు బాబు పెద్ద ఫైటింగ్ వుందనుకుంటూ.

"అంత దగ్గరగా వచ్చినప్పుడు అబ్బాయి ఏమయినా చెయ్యగలడు కాని. ఆ అమ్మాయికి మరొకళ్ళ ఆసరా వుందని తెలుసుకుని లొంగిపోయాడు."

"తర్వాత?" అన్నాడు సుందర్రావు నవ్వుతూ. రేణుకకి తెలిసిందని అతనికి అర్థం అయిపోయింది. "ఇంకేముంది? కథ అయిపోయింది. చెక్‌మేట్! ఆట కట్టు! బోర్డు అలమారాలోకి- పావులు డబ్బాలోకి."

సుందర్రావు మెచ్చుకోలుగా చూశాడు.

"ఎలా తెలిసింది నీకు?" అన్నాడు.

"మీరు కథ చెబుతానంటేనే నాకు ఆశ్చర్యం వేసింది. సగందాకా వెర్రిదానిలాగా నమ్మాను. అయినా ఎప్పుడూ చదరంగం బల్లదగ్గర కూర్చోవటంతప్ప ప్రేమా, గీమాలేని మనిషికి కథలేమిటీ? అనుకున్నాను. అప్పుడు తెలిసింది."

హఠాత్తుగా ఫైటింగ్ కథఆపేసి అమ్మా, నాన్నా మాట్లాడేసుకోవటం బాబుకి నచ్చలేదు. హడావిడి చేసే వాడేగాని. ముందు జాగ్రత్తగా రేణుక తెచ్చిన క్రీం బిస్కట్లు వ్యవహారాన్ని పరిష్కరించాయి.

తెల్లటి వెన్నెల బాక్‌గ్రౌండులో వర్ణ (నాతీత) చిత్రం లాగా వున్న రేణుకని చూస్తూ "కథలో నల్లబ్బాయి, తెల్లమ్మాయిలా వున్నారు కదూ వీళ్ళు ఇద్దరూ" అని చిరుగాలి నవ్వుతూ చెబుతోంటే, అవునని కొబ్బరి చెట్లు తలలు వూపుతున్నాయి!


# జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



## జలుబును పోగొట్టుకోవచ్చు

ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

## జలుబు మందుతో వాటిని ఎదుర్కొండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

## కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది